నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శనివారం 12 ఏప్రిల్ 2025 | SIDDIPET

హరీశ్‌రావు తండ్రికి పరామర్శ


పరామర్శిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, గణేశ్‌గుప్తా

సిద్దిపేట, ఏప్రిల్ 11: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావును శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పరామర్శించారు. సత్యనారాయణరావు ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే హరీశ్‌రావును అడిగి తెలుసుకున్నారు.

ఊరూవాడ వాల్‌రైటింగ్

సిద్దిపేట, ఏప్రిల్ 11: ఈనెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ శ్రేణులు వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నాయి. ఉద్యమ పురిటి గడ్డ సిద్దిపేట నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ గ్రామాన 'గులాబీ జెండా.. 25 ఏండ్ల పండుగ', 'తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష' అనే క్యాప్షన్‌తో వాల్ రైటింగ్‌లు రాస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలంలో సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు భూమయ్యగారి కిషన్‌రెడ్డి, చిన్నకోడూరు మండలంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, నంగునూరు మండలంలో పార్టీ అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ ఆధ్వర్యంలో వాల్ రైటింగ్ రాయించారు.

సిద్దిపేట రూరల్ మండలంలో రజతోత్సవ సభకు రావాలని వాల్ రైటింగ్

నంగునూరు మండలంలో వాల్ రైటింగ్

పెద్దఎత్తున పంట నష్టం వాటిల్లింది


ఇబ్రహీంనగర్‌లో పంటలను పరిశీలిస్తున్న మంత్రుల బృందం

- 24 గంటల్లో ప్రభుత్వానికి వివరాలు అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించాం
- బాధిత రైతులకు పరిహారం అందిస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చిన్నకోడూరు, ఏప్రిల్ 11: రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లాలో అకాల వర్షం, వడగండ్లు, ఈదురుగాలల దాటికి పెద్ద ఎత్తున పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో వడగండ్లకు నష్టపోయిన పంటలను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అకాల వర్షం, రాళ్లవానతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. రైతులను ఆదుకోవడానికి సీఎం ఆదేశించారని, పంట నష్టం వివరాలు అందజేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 24 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశామని, ఇందులో సిద్దిపేట జిల్లాలో ఎక్కువ నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతులను ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి తుమ్మల తెలిపారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. జిల్లాలో 9300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. వాటిలో 6400 ఎకరాల్లో వరి, 1200 ఎకరాల్లో మామిడి, 1600 ఎకరాల్లో కూరగాయల పంటకు నష్టం జరిగిందని వ్యవసాయ, ఉద్యానవన అధికారులతో నష్టాన్ని అంచనా వేస్తున్నామని తెలిపారు. నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి పూర్తి నివేదిక ఇస్తామని తెలిపారు.

బిల్లు రాదు.. ఇల్లు కాదు!

ఇందిరమ్మ ఇండ్ల పనుల్లో పురోగతి కరువు

- పైలెట్ గ్రామాల్లో 7848 మందికి మంజూరు
- సిద్దిపేటలో 80, మెదక్‌లో 50, సంగారెడ్డిలో 60 ఇండ్లు బేస్‌మెంట్ వరకు పరిమితం
- లబ్ధిదారులకు ఇప్పటి వరకు రాని బిల్లులు
- అప్పుల పాలవుతున్న లబ్ధిదారులు
- నియోజకవర్గానికి 3500 ఇండ్ల కేటాయింపు జాడేది..


పటాన్‌చెరు రూరల్: రామేశ్వరంబండలో బిల్లు రాకపోవడంతో ఆగిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు

సిద్దిపేట, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ముందుకు కదలడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాట ప్రకటనలు తప్పా లబ్ధిదారులకు చేయూత ఇచ్చేదిగా ఈ స్కీం లేదు. ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన లేకుండా పోతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తే ఇదే అవగతమవుతున్నది. ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆశపడి ఉన్న ఇంటిని కూలగొట్టుకున్న లబ్ధిదారుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఇటు ఉన్న ఇల్లు పోయింది.. అటు ప్రభుత్వం నుంచి సహకారం లేక ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రతి మండలం నుంచి ఒక్క గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో పురోగతి లేదు. లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు పనులు పూర్తి చేసినా ఇప్పటి వరకు పైసా బిల్లులు రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

ముందుకు కదలని ఇందిరమ్మ ఇండ్లు

సిద్దిపేట జిల్లాలో 2667 మంది, మెదక్ జిల్లాలో 1242 మంది, సంగారెడ్డి జిల్లాలో 3939 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీరందరికీ మంజూరు పత్రాలు ఇచ్చి దాదాపుగా రెండు నెలలు దాటుతున్నది. ఇప్పటి వరకు మెజార్టీ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించలేదు. ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడంతోనే తాము ఇంటి నిర్మాణాలు ప్రారంభించడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 7848 ఇండ్లు మంజూరయ్యాయి. ప్రతి మండలం నుంచి ఒక్క గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో 26మండలాల్లో ఒక్కో గ్రామం చొప్పున 26 పైలెట్ ప్రాజెక్టు గ్రామాలుగా తీసుకుంది. ఇప్పటి వరకు ఈ జిల్లాలో 540 మంది లబ్ధిదారులు మాత్రమే ముగ్గులు పోసినట్లు సమాచారం. వీటిలో 80 గృహాల వరకు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. మిగతావి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉంది. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు 2,30,483 దరఖాస్తులు వచ్చాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా సొంతింటి స్థలం ఉండి పక్కా ఇల్లు లేని వారు 76,337 మంది ఉన్నారు. అసలే ఇంటి స్థలం లేని వారు 34,404 మంది, అనర్హులుగా 1,19,742 మందిని గుర్తించారు.

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో 1242 ఇండ్లను 21 పైలెట్ గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు 215 ఇండ్ల పనులు మాత్రమే ప్రారంభించారు. ప్రారంభించిన వాటిలో 50 ఇండ్లు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు ఒక్క లబ్ధిదారుడికి బిల్లు రాలేదు.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలో మొత్తం లబ్ధిదారులు 3,339 మంది కాగా, నిర్మించడానికి సిద్ధంగా ఉన్న 1231 మందికి ఇండ్లు మంజూరు చేశారు. వీరిలో 350 ఇండ్ల పని ప్రారంభించారు. 25 మండలాల్లో బేస్‌మెంట్ లెవల్‌లో 60 ఇండ్ల పనులు జరిగాయి. జిల్లాలో మిగతావి పురోగతిలో లేవు.

నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఎక్కడ?

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పింది. కానీ, ప్రస్తుతానికి ఒక్క పైలెట్ గ్రామాలకే ఇండ్లను మంజూరు చేసి చేతులు దులుపుకొంది. పైలెట్ గ్రామాల్లోనూ పురోగతి లేదు. చాలా ఇండ్లకు బిల్లులు రాక బేస్‌మెంట్ వరకు పనులు ఆగిపోయాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 10శాసనసభా స్థానాలు ఉన్నాయి. వీటితో పాటు హుస్నాబాద్, జనగామ, మానకొండూరు నియోజకవర్గాల మండలాలు ఉన్నాయి. ఈ లెక్కన ప్రభుత్వం చెప్పిన విధంగా ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున దాదాపు 40వేల ఇండ్లు మంజూరు కావాలి. కానీ, కేవలం ఉమ్మడి మెదక్‌కు జిల్లాకు 7848 ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో దరఖాస్తుదారుల్లో నిరుత్సాహం అలుముకుంది.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

రెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 11: రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యాన్ని సజావుగా కొనుగోలు చేయాలని అధికారులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదేశించారు. శుక్రవారం నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొన్న ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. లారీలను అందుబాటులో ఉంచాలని, రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు త్వరగా జమ చేయాలన్నారు. గత సీజన్‌లో పంట బోనస్ డబ్బులు చాలామంది రైతులకు అందలేదని, ఇప్పుడు అలాంటి తప్పిదం లేకుండా ప్రభుత్వం చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ వైద్య శ్రీనివాస్, ఏపీఎం గౌరీశంకర్, సీసీ ప్రవీణ, ఏఈవో నిరోష, పంచాయతీ కార్యదర్శి రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, నాయకులు మహేశ్‌గౌడ్, రాజుగౌడ్, శేఖయ్య, కనకయ్య, శేఖర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

అబ్బెందలో బుద్ధుని విగ్రహం ధ్వంసం

- దళిత సంఘాల ఆందోళన
- ఘటనపై పోలీసుల విచారణ

సంగారెడ్డి జిల్లా అబ్బెందలో ధ్వంసమైన గౌతమ బుద్ధుడి విగ్రహం

నారాయణఖేడ్, ఏప్రిల్ 11: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహం తల భాగం పగిలిపోయి కింద పడి ఉంది. దీంతో శుక్రవారం బీఎస్పీ నాయకులతో పాటు పలు దళిత సంఘాల బాధ్యులు గ్రామానికి చేరుకుని విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు విశ్వనాథ్, మారుతి, పండరి, భీమసేన తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి బాధ్యులను అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ సిద్ధంచేయాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరావు

సిద్దిపేట అర్బన్/నంగునూరు, ఏప్రిల్ 11 : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని జూన్ నెలాఖరు నాటికి సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ ఫ్యాక్టరీ పనులను పరిశీలించి పురోగతిని తెలుసుకున్నారు. నిర్మాణ పనులు ఆలస్యం అవుతుండడంపై అధికారులపై మంత్రి తుమ్మల అసహనం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా తెలంగాణకు గుండెకాయ వంటిదని, అన్ని జిల్లాలకు మధ్యలో ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే ఏకైక ఆయిల్, రిఫైనరీ ఫ్యాక్టరీ నర్మెట ఫ్యాక్టరీలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో పామాయిల్ కొరత చాలా ఉందని, రైతులు ఎంత ఎక్కువ పండిస్తే అంత ఆదాయం పొందవచ్చని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయిల్ పామ్ సాగును పెంచాలన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం చూపారు. అందరు అధికారులు, ప్రజాప్రతినిధులు మాదిరిగానే పాలమాకుల పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి ఫ్యాక్టరీ వద్దకు రాగా, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి అన్న కారణంతో మంత్రులు మీడియాతో మాట్లాడుతున్న సమయంలో అతడిని పోలీసులు నెట్టిపడేశారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డిని నెట్టివేస్తున్న పోలీసులు

కూలిన గుడిసెలో ఉంటున్నం..

వెల్దుర్తి, ఏప్రిల్ 11: మూడేండ్ల కిందట నాభర్త చనిపోయిండు. ఒక్కగానొక్క కొడుక్కు సొమ్ము రోగం ఉంది. దీంతో ఎవరు పనికి పిలవరు. పనిచేసే పరిస్థితిలో నా కొడుకు లేడు. కూలిపోతున్న గుడిసెలో కొడుకుతో కలిసి ఉంటున్నా. గాలిదుమారం, వర్షాలు వస్తే సెక్రటరీ సారు దయతో పంచాయతీ కార్యాలయంలో తలదాచుకుంటున్న. నా పేరు మీద అప్పుడెప్పుడో ఇల్లు వచ్చిందని, బిల్లు కూడా వచ్చిందని సార్లు చెబుతున్నారు. నాభర్త ఉన్న సమయంలో బేస్‌మెంట్ వరకు ఇల్లు కట్టి పైసలు లేకపోవడంతో వదిలేసిండు. ఇప్పటికి ఇల్లు లేదు. సగం కూలిన గుడిసెలో ఉంటున్నాం. ఇల్లు మంజూరైనట్లు సార్లు కాగితం కూడా ఇచ్చిర్రు. కానీ, ఇప్పుడు గతంలో ఇల్లు మంజూరైందని, ఇప్పుడు ఇల్లు రాదని సార్లు చెప్తుర్రు. భర్త చనిపోయి ఏండ్లు గడుస్తున్న పింఛన్ రావడం లేదు. రెండు గుంటల భూమి ఉందని, కూలీలకు ప్రభుత్వం ఇస్తామన్న పైసలు కూడా ఇవ్వలేదు. దీంతో చేసేదేమీ లేక కూలిపోతున్న గుడిసెలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా నాకు ఇల్లు మంజూరుచేసి న్యాయం చేయాలి.

– జాజాల మొగులమ్మ, ధర్మారం, వెల్దుర్తి మండలం (మెదక్ జిల్లా)

ఇతరుల స్థలంలో గుడిసె వేసుకున్నం..

వెల్దుర్తి, ఏప్రిల్ 11: ఏండ్ల నాటి పెంకుటిల్లు రెండేండ్ల క్రితం కూలిపోయింది. ఇతరుల సాయంతో వారి స్థలంలో గుడిసె వేసుకొని బతుకుతున్నాం. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు పత్రం ఇచ్చారు. దీంతో ఇల్లు కట్టుకుందామని ఎంతో ఆశతో ఉన్న మాకు, ఇల్లు మంజూరు కాలేదని, జాబితాలో మీ పేరు లేదని సార్లు మల్లా ఇప్పుడు చెప్తుర్రు. ఏండ్ల క్రితం మా పేరు మీద ఇల్లు మంజూరైందని, దీంతో ఇప్పుడు ఇల్లు రాదని సార్లు అంటుర్రు. మాలాంటి ఇల్లు లేని వారికే కదా పథకాలు అందాలి. అప్పుడెప్పుడో ఇల్లు వచ్చిందని సార్లు అంటుర్రు. కానీ, మాకు మాత్రం ఇల్లు లేదు. మా పరిస్థితి గ్రామంలో అందరికీ తెలుసు. మాలాంటి పేదలకు ఇండ్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

– బెస్త పద్మ, ధర్మారం, వెల్దుర్తి మండలం (మెదక్ జిల్లా)

పేదలపై భారం మోపుతున్న కేంద్రం

- సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌లో చాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 11: వంటగ్యాస్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం పేదలపై భారం మోపిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే పెట్రో, డీజిల్ ధరలు దేశంలో ఎక్కువగా ఉన్నాయని, ఇప్పుడు వంటగ్యాస్ ధర పెంచి కేంద్ర ప్రభుత్వం పేదలపై భారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశవ్యాప్తంగా కులగణను చేపట్టాలని డిమాండ్ చేశారు. నరేంద్రమోదీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్నదని విమర్శించారు. అనంతరం మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి చాడ వెంకటరెడ్డితో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిబాపూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో మంద పవన్, గడిపె మల్లేశ్, జాగీరు సత్యనారాయణ, ఎడల వనేశ్, కొమ్ముల భాస్కర్, జెర్రిపోతుల జనార్దన్, యాద పద్మ, అయిలేని సంజీవరెడ్డి, మల్లారెడ్డి, మాడిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలివేటు

గురుజువాడ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నరికిన చెట్లు

కోహీర్, ఏప్రిల్ 11: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గురుజువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొన్నేండ్ల క్రితం హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. పాఠశాల అప్పటి హెచ్ఎంలు శ్రీనివాస్, జీన్‌రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో శ్రద్ధ తీసుకుని మొక్కలను సంరక్షించారు. అప్పట్లో నాటిన మొక్కలు పెరిగి పెద్దగా మారి నీడనిస్తున్నాయి, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. విద్యార్థులకు స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయి. ప్రస్తుతం హెచ్ఎం ప్రభు శుక్రవారం పాఠశాల ఆవరణలోని హరితహారం చెట్లను నరికి వేయించాడు. ఖాళీ స్థలంలో మొక్కలు నాటాల్సిందిపోయి ఉన్న చెట్లను నరికి వేయించడంపై విద్యార్థులు మండిపడుతున్నారు. హరితహారం అమలులో మండలంలోనే పేరుగాంచిన తమ పాఠశాల నేడు ఇలా తయారైందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పనికిరాని చెట్లనే నరికి వేయించామని హెచ్ఎం సమాధానమివ్వడం విశేషం. చెట్ల నరికివేతపై ఎంఈవోను వివరణ కోరగా తనకు తెలియదన్నారు. హెచ్ఎంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.

ప్యారానగర్‌లో డంపుయార్డు వద్దేవద్దు

- తమ అభిప్రాయాన్ని తెలియజేసిన నల్లవల్లి, కొత్తపల్లి గ్రామస్తులు
- ఒక్కచోటుకు చేరి అభ్యంతరాలు తెలిపేందుకు సిద్ధమైన ప్రజలు
- అభ్యంతరం వ్యక్తం చేస్తూ అడ్డుకున్న పోలీసు అధికారులు

గుమ్మడిదలలో తహసీల్ కార్యాలయం వద్ద డంపింగ్ యార్డుపై అభ్యంతరాలు అందజేయడానికి వచ్చిన నల్లవల్లి, కొత్తపల్లి గ్రామస్తులు

గుమ్మడిదల, ఏప్రిల్ 11: సంగారెడ్డి జల్లా ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ) వద్దంటూ నల్లవల్లి, కొత్తపల్లి గ్రామస్తులు శుక్రవారం గుమ్మడిదల తహసీల్ కార్యాలయానికి తరలివచ్చి ఆర్డీవో రవీందర్‌రెడ్డికి, తహసీల్దార్ పరమేశ్‌కు వినతి పత్రాలు అందజేశారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం తరలివచ్చారు. సుమారు 1190 మంది వరకు డంపుయార్డు వ్యతిరేకిస్తూ వ్యక్తిగతంగా వినతి పత్రాలు అందజేశారని తహసీల్దార్ వెల్లడించారు. డంపుయార్డుపై అభ్యంతరాలు తెలపాలని ఈనెల 3న తహసీల్దార్ నల్లవల్లి గ్రామ పంచాయతీలో నోటీస్ అతికించారు. 15 రోజుల్లోపు అభ్యంతరాలు తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు. దీంతో శుక్రవారం నల్లవల్లి, కొత్తపల్లి గ్రామస్తులు ఒక్కచోటకు చేరుకుని అభ్యంతరాలు తెలిపిందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు నయీముద్దీన్, లాలూ నాయక్, ఎస్సైలు మహేశ్వర్‌రెడ్డి, నాగలక్ష్మి పోలీస్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. వందల సంఖ్యలో ప్రజలు ట్రాక్టర్లపై రావడానికి యత్నించడంతో పోలీస్ అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. డంపింగ్ యార్డుపై అభ్యంతరాలు తెలియజేయాలని రెవెన్యూ అధికారులు సూచిస్తే, పోలీసులు వచ్చి అడ్డుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడ్డారు. అదనపు ఎస్పీ సంజీవరావు నల్లవల్లికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. శాంతియుతంగా అభ్యంతరాలను తెలియజేస్తామని గ్రామస్తులు హామీ ఇవ్వడంతో పోలీస్ అధికారులు వెనక్కి తగ్గారు. కాగా, డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నల్లవల్లి, కొత్తపల్లి, గుమ్మడిదలలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 66వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు దోమడుగు శంకర్, బానోతు ఆంజనేయులు, రైతు జేఏసీ నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, పి.వేణు, పి.శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, మన్నె రామకృష్ణ, కొరివి సురేశ్, కుమ్మరి ఆంజనేయులు, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, చాపల మధు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మైలారం,జెబ్బాపూర్ గ్రామాల మధ్య నరికివేసిన హరితహారం చెట్లు

వర్గల్, ఏప్రిల్ 11: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని మైలారం, జెబ్బాపూర్ గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పాదచారులకు, వాహనదారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చెట్లు విద్యుత్ లైన్లకు ఆనుతున్నాయనే కారణంగా గురువారం విద్యుత్ శాఖ అధికారులు కొట్టివేశారు. ఎండాకాలంలో ఎండలు దంచికొడుతుంటే చెట్లను నరికివేయడంతో బాటసారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది.